

సాక్షి
గుంటూరు
బుధవారం । 25 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.7200 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4200 క్యూసెక్కులు వదులుతున్నారు.



కృష్ణా డెల్టాకు 2216 క్యూసెక్కులు

తాడేపల్లి రూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2216 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. కొమ్మమూరు కాలువకు 1231 క్యూసెక్కులు వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

రేపు ఇంద్రకీలాద్రిపై శ్రీపంచమి వేడుకలు

- సరస్వతిదేవిగా దుర్గమ్మ దర్శనం
- విద్యార్థులకు పెన్నుల పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఈ నెల 26వ తేదీ మాఘ శుద్ధపంచమి(శ్రీపంచమి)ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీ పంచమి నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ మూర్తిని సరస్వతిదేవి అలంకారంలో దర్శించుకునే భాగ్యం భక్తులకు, విద్యార్థులకు కలగనుంది. వార్షిక పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని, పోటీ పరీక్షలలో నెగ్గి కోరుకున్న సీటు లభించాలని కాంక్షిస్తూ అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజలు నిర్వహించిన పెన్నులను శ్రీపంచమి రోజున పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవస్థానం పూర్తి చేసింది. కనకదుర్గనగర్ నుంచి కొండపైకి చేరుకునేలా దేవస్థానం క్యూలైన్లు ఏర్పాటు చేసింది. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ఉత్సవ మూర్తిని దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవ మూర్తిని దర్శించుకున్న విద్యార్థులందరికీ పెన్ను, అమ్మవారి పాకెట్ సైజ్ ఫొటో, కుంకుమ, ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యార్థులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా స్కూల్, కాలేజీ యూనిఫాంను, ఐడీ కార్డును తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని ఆలయ అధికారులు సూచిస్తున్నారు. 26వ తేదీ రిపబ్లిక్ డే నేపథ్యంలో స్కూళ్లు, కాలేజీలకు సెలవు కావడంతో పెద్దఎత్తున విద్యార్థులు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 40 వేల పైబడి విద్యార్థులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని, ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించండి

నరసరావుపేట: ప్రభుత్వ పెన్షన్‌దారులందరూ ఫిబ్రవరి 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని జిల్లా ఖజానా, లేఖల అధికారి వి.స్వామినాథన్ మంగళవారం కోరారు. లైఫ్ సర్టిఫికెట్‌ను జీవన ప్రమాణ యాప్, ఖజానా కార్యాలయం, పెన్షన్ అసోసియేషన్స్‌లో, మీసేవ లేదా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా సమర్పించవచ్చన్నారు. వేలిముద్రల సమస్య ఉన్నవారు నేరుగా ఖజానా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రెండు పెన్షన్‌లు పొందేవారు, కుటుంబ పెన్షన్, జీఓ 315 ప్రకారం పెన్షన పొందేవారు తగిన సర్టిఫికెట్లతో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. పెన్షన్‌దారులందరూ తమ ఆధార్ ఆధారిత మొబైల్ నంబరు హెర్బ్ పోర్టల్‌లో నమోదు చేయుట ద్వారా ఈకేవైసీని పూర్తి చేయాలని కోరారు. ఈకేవైసీ విషయంలో సంబంధిత ఎస్‌టీఓ కార్యాలయం తగిన సహకారం అందజేస్తుందని చెప్పారు.

కొప్పురావూరు, కంతేరు రైల్వే గేట్ల మూత

తాడికొండ: సబ్‌వేల నిర్మాణం నిమిత్తం తాడికొండ మండలం కంతేరు– పెదకాకాని మండలం కొప్పురావూరు రైల్వే గేట్లను 6 నెలల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తహసీల్దార్ ఫణీంద్ర బాబు తెలిపారు. ప్రయాణికులు అసౌకర్యాన్ని గమనించి గేటు నంబర్ 7 ద్వారా రాకపోకలు సాగించాలని సూచించారు.

లక్షకు చేరిన మిర్చి బస్తాల రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,05,607 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,222 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 61,269 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 570.60 అడుగుల వద్ద ఉంది. ఇది 258.0802 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 10,200, ఎడమ కాలువకు 8,367, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 4,494, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 24,861 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఉగాదికి జగనన్న గృహ వైభవం

పాత సంవత్సరాలు పోతాయి.. కొత్త సంవత్సరాలు వస్తాయి.. మన కల మనకు తెలుసు. మన కలకు మనం తెలుసు. అది నెరవేరితే దాని ఆనందం మన మనసుకు తెలుసు. ఏన్నో ఏళ్లుగా మన సొంతింటి 'కల' నెరవేరబోతోంది. మన జగనన్న సంకల్పం సిద్ధించే సమయం రానుంది. అడుగులు శరవేగంగా పడుతున్నాయి. పేదల మోములో ఆనందమే లక్ష్యం. క్షణక్షణం ఇంజినీర్లు, అధికారుల కృషి. ఇంటిని సొంతం చేసుకోవాలన్న పేదల ఆకాంక్ష. ఈ ఉగాది ప్రతి గుమ్మానికి అభివృద్ధి తోరణం కట్టి, సంక్షేమ ముగ్గులు పెట్టి సంతోషాల పసుపు పూసేందుకు కదిలివస్తోంది నవరత్నాల నవ వసంతం. ఆ రోజు ప్రతి లబ్ధిదారు గుమ్మాంలో కాంతులు విరియాలి.



నంబూరులో నిర్మించిన జగనన్న కాలనీ

- పదివేల జగనన్న ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- ఇప్పటికే 5,085 ఇళ్లు పూర్తి
- మూడు వేల ఇళ్లు రూఫ్ లెవల్‌కు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో ఉగాది నాటికి పది వేల ఇళ్లు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని కోసం అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి పెట్టింది. ప్రభుత్వం జిల్లాలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. గత ఏడాది చివరి వరకు వర్షాలు పడుతూ ఉండటంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాన్ని అనుకున్న స్థాయిలో చేపట్టలేకపోయారు. ఇప్పటి వరకూ జిల్లాలో 5,085 ఇళ్లు పూర్తి కాగా, మరో మూడు వేల ఇళ్ల వరకూ రూఫ్‌లెవల్‌కు చేరుకున్నాయి. 18,590 ఇళ్లు బేస్‌మెంట్ దాటాయి. ఉగాది నాటికి పది వేల ఇళ్లను పూర్తి చేయించే దిశగా అధికారులు పని చేస్తున్నారు. ప్రతి శనివారం వైఎస్సార్ జగనన్న కాలనీలలో హౌసింగ్ డే నిర్వహిస్తున్నారు. దీనికి ఉన్నతాధికారులు హాజరై జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వీటిని పూర్తి చేయడానికి రోజువారీ ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు.



నంబూరులో నిర్మించిన ఇల్లు

ఎమినిటీ కార్యదర్శులు..

వార్డు ఎమినిటీ కార్యదర్శులను ఇళ్ల నిర్మాణం ప్రణాళిక అమలుకు బాధ్యులుగా నియమించారు. నిర్మాణ పురోగతి, లేఅవుట్లలో కడుతున్న ఇళ్ల వివరాలను ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటున్నారు. ఆప్షన్–3లో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల వివరాలను లబ్ధిదారులకు అందజేయడమే కాకుండా, తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణం ఎలా జరుగుతుందో, వాటి నాణ్యత ప్రమాణాలను కూడా పరిశీలించాలని కోరారు. ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి ఆటంకాలు ఉన్నా తమకు తెలియచేయాలని ఉన్నతాధికారులు ఇప్పటికే కింది స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాకు ఇళ్లు మంజూరు	67, 678
ఇప్పటికి పూర్తి	5,085
బేస్‌మెంట్ స్థాయికి	18,590

లబ్ధిదారులకు సాయం	
వడ్డీ లేని రుణం	రూ.35 వేలు
అందిన సాయం	రూ.64 కోట్లు

లబ్ధిదారుడికి సాయం ఇలా..

ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్, ఇనుము ఇస్తున్నారు. వీటితో పాటు డ్వాక్రా సంఘ సభ్యులకు పావలా వడ్డీకే రూ.35 వేలు ఆర్థిక సాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఇప్పటికే 18,360 మందికి 64 కోట్ల రూపాయలకు పైగా రుణాలు అందించారు.

వ్యయం పెంపుదలకు వినతులు..

ఇంటి నిర్మాణం వ్యయం పెరుగుతండడంతో లబ్ధిదారుల నుంచి వినతులు అందుతున్నాయి. డీఆర్‌డీఏ నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉన్నతి పథకం కింద మరో రూ.35 వేలు వడ్డీ లేని రుణంగా ఇప్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. మిగిలిన వారికి కూడా డ్వాక్రా రుణాలు ఎక్కువ మొత్తం ఇప్పించి అందులో 35 వేల రూపాయలు ప్రతి లబ్ధిదారుడు ఇంటి కోసం వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఇంటి నిర్మాణం కోసం సుమారు రెండున్నర లక్షల రూపాయలు లబ్ధిదారునికి అందనుంది.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు హర్షణీయం

బాపట్ల ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగం సురేష్ కుమార్



ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పది సంవత్సరాలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షణీయమని బాపట్ల ఎంపీ, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగం సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013 జనవరి 23న మొదలైన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ఈ నెల 23తో ముగిసిందని, కానీ రద్దు కాకుండా ముందుగానే గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్ తీసుకురావడం ఎస్సీ, ఎస్టీలు వరంగా భావించాలన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా సబ్‌ప్లాన్ గడువును పెంచి అగ్రగామిగా నిలిపిన జగనన్న ఎస్సీ, ఎస్టీలపై తనకున్న ప్రేమను చాటుకున్నారన్నారు. సబ్‌ప్లాన్ నిధుల ద్వారా ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు సాయం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పట్టణ పేదలను ఆదుకోవడం, ఎస్సీల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్‌లు జారీ చేయడం వంటి పనులను కేంద్రం మెచ్చుకుందన్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశంలోని 22 రాష్ట్రాల్లో మొత్తం 29.84 లక్షల ఎస్సీ కుటుంబాలకు సాయం అందించగా, అందులో 29.10 లక్షల ఎస్సీ కుటుంబాలు మన ఏపీలో సాయం పొందడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో 6.15 లక్షల ఎస్సీ విద్యార్థులకు సబ్‌ప్లాన్‌లో స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ప్రభుత్వం, సబ్‌ప్లాన్ కింద 1,38,245 ఇళ్ల నిర్మాణం చేయడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు.

ఫలించిన 11 ఏళ్ల నిరీక్షణ

- 2012లో తెనాలిలో తప్పిపోయిన బాలిక
- నేడు కుటుంబానికి చేరువ
- ఐసీడీఎస్ పీడీ చొరవతో కథ సుఖాంతం

నెహ్రూనగర్(గుంటూరు తూర్పు): 11 సంవత్సరాల క్రితం తప్పిపోయి స్వధార్ హోంలో ఉంటున్న యువతిని వారి కుటుంబ సభ్యులకు ఐసీడీఎస్ అధికారులు మంగళవారం అప్పగించారు. కూలి పనుల నిమిత్తం 2012వ సంవత్సరంలో శ్రీకాకుళం జిల్లా జెన్నడుగూడ గ్రామానికి సవరం గంగయ్య, సిప్పొని ఆమె కూతురు ప్రమీల(29) కాకినాడ ప్రాంతానికి రొయ్యల ఫ్యాక్టలో పని చేసేందుకు వచ్చారు. అయితే తన తోటి పనివారైన ఇద్దరు అమ్మాయిలతో కలిసి ప్రమీల గుంటూరు జిల్లాకు తెనాలికి వచ్చింది. తెనాలిలో ట్రైన్ ఎక్కాల్సిన ప్రమీల ట్రైన్ ఎక్కక పోవడంతో స్టేషన్‌లో బిక్కుబిక్కుమంటూ తిరుగుతున్న యువతిని పోలీసులు గుర్తించి తెనాలి జేఎంజే స్వధార్ హోంకు తరలిచ్చారు. 11 సంవత్సరాల నుంచి అక్కడే ఉంటూ.. ఈ మధ్య కాలంలో తెనాలి స్వధార్ హోం పరిశీలనకు వెళ్లిన ఐసీడీస్ పీడీ మనోరంజనీ ఆ యువతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'తనది శ్రీకాకుళం అని... తనను ఇంటికి పంపించాలని' విజ్ఞప్తి చేసింది. స్పందించిన పీడీ సదరు యువతి వివరాలు సేకరించి వారి ఇంటికి పంపించే ప్రయత్నం చేయాలని సఖి లాయర్ విజయలక్ష్మికి సూచించారు. విజయలక్ష్మి సీతంపేట పోలీసులను సంప్రదించడంతో సచివాలయ మహిళా పోలీసు సహకారంతో సదరు యువతి కుటుంబ సభ్యుల ఆచూకీ తెలుసుకుని వారిని గుంటూరుకు పిలిపించారు. మంగళవారం గుంటూరు వచ్చిన యువతి అన్నయ్య కూర్మరావుకు ఐసీడీఎస్ పీడీ మనోరంజనీ సమక్షంలో ప్రమీలను అప్పగించారు.



ప్రమీలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పీడీ బి.మనోరంజనీ, సఖీ న్యాయవాది విజయలక్ష్మి

నిమ్మకాయలు క్వింటా 2,300

తెనాలి టౌన్: స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు గరిష్ట ధర రూ.2300 పలికింది. కనిష్ట ధర రూ.1500 కాగా మోడల్ ధర రూ.1800 వరకు పలికింది.



27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈపీఎఫ్ చట్టం–1952ను అనుసరించి పీఎఫ్ పింఛనుదారులకు అందిస్తున్న వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు పర్చే లక్ష్యంతో ఈపీఎఫ్ అందించే సేవలను సంస్థల యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లకు మరింత చేరువ చేసేందుకు ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి భవన్‌లో, బాపట్లలోని వ్యవసాయ కళాశాల, నరసరావుపేటలోని చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమం రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. యజమానులందరు విధిగా హాజరు కావాలని, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు పింఛనుదారులందరి దృష్టికి సైతం తీసుకురావాలని సూచించారు. ఈనెల 27న సెలవు దినంగా ప్రకటించిన పక్షంలో మరుసటి రోజు యధావిధిగా జరుగుతాయని తెలిపారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది కేంద్రాలు
- ఉదయం 7.00 గంటలకే చేరుకున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశానికై ఉద్దేశించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన పేపర్–1, పేపర్–2 ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు సకాలంలో హాజరయ్యారు. బీఈ, బీటెక్, బీఆర్క్, ప్లానింగ్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 9,500 మంది విద్యార్థులు ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరగనున్న ఆన్‌లైన్ పరీక్షలకు ఆయా తేదీల్లో కేటాయించిన స్లాట్ల ఆధారంగా హాజరుకానున్నారు. పరీక్ష సమయానికి రెండు గంటలు ముందుగా పరీక్ష కేంద్రాలు చేరుకోవాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విధించిన నిబంధనలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ కళాశాలలు గుంటూరు నగరంతో పాటు ఆయా ప్రాంతాలకు దూరంగా ఉండటం, విద్యార్థులను ఉదయం 7.00 గంటలకే పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లాల్సి ఉన్న దృష్ట్యా చలి తీవ్రతలోనే తల్లిదండ్రులు కేంద్రాలకు వెళ్లారు.



విద్యార్థిని హాల్ టికెట్ తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది

హాస్టల్ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడండి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి

గుంటూరు వెస్ట్: వసతి గృహాల్లో విద్యనభ్యసించే పిల్లల్ని వారి తల్లిదండ్రులు మనపై నమ్మకముంచి వెళుతున్నారని వారిని సొంత బిడ్డల్లా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో చదివే 10వ తరగతి విద్యార్థులకు రానున్న పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని చెప్పారు. జిల్లాలోని మొత్తం 78 ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో 4260 మంది ఉన్నారన్నారు. వీరిలో 344 మంది పదో తరగతి చదువుతున్నట్లు చెప్పారు. వీరందరూ ఉత్తీర్ణులు అవడంతోపాటు అత్యుత్తమ మార్కుల సాధించేందుకు వెల్ఫేర్ ఆఫీసర్స్, వార్డెన్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వసతి గృహాల్లో పరిశుభ్రమైన మరుగుదొడ్లు, మంచినీరు, బలవర్ధక ఆహారం ఉండేలా శ్రద్ధ ఉంచాలని పేర్కొన్నారు. సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి మొహమ్మద్ ఘని, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి

దండిగా స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తి

- రిపబ్లిక్ డే సందర్భంగా ప్రారంభానికి సిద్ధమైన దండి మార్చ్ విగ్రహాలు
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి



పెదకాకాని వై జంక్షన్‌లో దండి మార్చ్ విగ్రహాలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెదకాకాని: భారత స్వాతంత్య్రోద్యమంలో ఉప్పు సత్యాగ్రహాన్ని కీలకఘట్టంగా అభివర్ణించవచ్చు. బ్రిటిష్ పాలకులు ఉప్పుపై పన్ను వేయడాన్ని వ్యతిరేకిస్తూ గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి దండి వరకు 384 కిలోమీటర్లు జరిగిన పాదయాత్రను జాతిపిత మహాత్మాగాంధీ ముందుండి నడిపారు. ఉప్పు సత్యాగ్రహం నాటి దేశ ప్రజల్లో రగిలించిన స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తి అంతాఇంతా కాదు.

ఆ దండి పాదయాత్ర స్ఫూర్తిని నేటితరానికి తెలియజేసేలా గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు నగర శివారు పెదకాకాని వై.జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన దండి మార్చ్ విగ్రహాలను రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం ప్రారంభించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు తదితరులు పరిశీలించారు. అనంతరం మేయర్ కావటి మనోహర్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రజల్లో స్వాతంత్య్ర స్ఫూర్తిని రగిలించేందుకు, స్వాతంత్య్ర ప్రాముఖ్యతను తెలిపేలా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దండి మార్చ్, స్వాతంత్య్ర సమర యోధుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పెదకాకాని వై జంక్షన్ వద్ద 18 అడుగుల ఎత్తు, 90 అడుగుల పొడవు ఉన్న మహాత్మా గాంధీ విగ్రహంతో పాటు దండి మార్చ్‌లో పాల్గొన్న మరో ఎనిమిది మంది ఉద్యమకారులతో కూడిన విగ్రహాలతో కూడిన మార్చ్ స్మారక స్థూపం నిర్మించినట్లు పేర్కొన్నారు. జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కామిరెడ్డి రంగారెడ్డి, పఠాన్ రిహానా, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు

నిబంధనలు పాటించాలి: జేసీ రాజకుమారి

గుంటూరు మెడికల్: ప్రతినెలా అబార్షన్లు మానిటరింగ్, డెకాయ్ ఆపరేషన్స్ తప్పనిసరిగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ కమిటీ, జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్స్‌ను ఆకస్మిక తనిఖీలు చేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న, ఎక్కువగా ఉన్న మండలాలను గుర్తించి ఆరోగ్య కార్యకర్తల ద్వారా సర్వే చేయించి కారణాలను విశ్లేషించి రిపోర్ట్ అందజేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అబార్షన్లు ఎక్కువగా జరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రులను గుర్తించి వాటిపై సమగ్ర విశ్లేషణతో రిపోర్ట్ అందచేయాలని కోరారు. సంతాన సాఫల్య కేంద్రాలను తనిఖీ చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కేంద్రాలపై తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె.హనుమంతరావు మాట్లాడుతూ జిల్లాలో రిజిస్ట్రేషన్ లేకుండా స్కానింగ్ సెంటర్ నడపరాదన్నారు. రిజిస్ట్రేషన్ లేని వారిపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. లింగ నిర్ధారణ కార్యక్రమాలకు పాల్పడుతున్న స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో కొత్తగా రెండు స్కానింగ్ సెంటర్లకు, మూడు సెంటర్లకు రెన్యువల్‌కు అనుమతి మంజూరు చేశారు. కొత్తగా రిజిస్ట్రేషన్ కొరకు నమోదు చేసుకున్న 12 ఏఆర్‌టీ కేంద్రాలకు, రెండు సరోగసి కేంద్రాలకు అనుమతి మంజూరు చేశారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, ఐసీడీఎస్ పీడీ మనోరంజని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

బలహీనవర్గాలు అభివృద్ధి సాధించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి


కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి: సమాజంలోని ఒడిదుడుకులను అధిగమించి బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి వైపు పయనించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బడుగు బలహీనవర్గాల ఐక్యవేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. నారాయణపురంలోని మండపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో ఐక్యవేదిక జిల్లా స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. తొలుత బంగ్లా సెంటర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే, గుర్రం జాషువా విగ్రహాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్సీ జంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ సమాజంలో ఎదిగిన కులాలను విమర్శించడం మానుకొని ఆ కులాలు ఏ విధంగా అభివృద్ధి చెందాయో, అదేవిధంగా బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి చెందేలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో మార్పుతో పాటుగా అట్టడుగు వర్గాల ప్రజలను ఏకం చేసేందుకు ఐక్య వేదిక ఉద్భవించిందని, బలహీనవర్గాల నుంచి నాయకత్వం రావాలన్నారు. నాయకుడిగా ఎదగాలంటే ప్రజల సమస్యలు పరిష్కరించే బుద్ధి కలిగి ఉండాలని, కష్టాల్లో ప్రజలకు అండగా ఉండే వ్యక్తే నాయకుడిగా ఎదిగే అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్సీ జంగా చెప్పారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, అన్ని రంగాల్లో బలహీన వర్గాలు అభివృద్ధి సాధించాలని కోరారు. ఐక్యవేదిక ద్వారా పల్నాడు ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ, యువకుల ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో యువత చైతన్యవంతులై మార్పు కోసం పాటుపడాలని ఆయన సూచించారు. నూతనంగా నియమితులైన ఐక్యవేదిక కమిటీ సభ్యులకు ఎమ్మెల్సీ జంగా నియామక పత్రాలు అందజేశారు.

దేవాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

సీత డైరెక్టర్ డి. రామచంద్రరావు


ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సీత డైరెక్టర్ డి. రామచంద్రరావు

తాడేపల్లిరూరల్ : దేవాయాలల్లో పనిచేస్తున్న సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సీత డైరెక్టర్ డి. రామ చంద్రరావు అన్నారు. మంగళవారం తాడేపల్లి కృష్ణాతీరంలోని రాష్ట్ర దేవాలయ పాలక సంస్థ (సీత) కార్యాలయంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో ఉన్న దేవాలయాల చైర్మన్లు, ధర్మకర్తలకు, ఇతర సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీత డైరెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేవాదాయ ధర్మాదాయ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నారని, వాటికి అనుగుణంగా దేవాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది కలసికట్టుగా పని చేసి హిందూ సాంప్రదాయాన్ని కాపాడి భక్తులకు సేవలను అందించాలన్నారు. అనంతరం వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు (దేవదాయ శాఖ) జ్వాలాపురం శ్రీకాంత్, అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు విజ్ఞాన్ ఎన్‌సీసీ విద్యార్థులు ఎంపిక




చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థులు చాగం రాఘవి (బీబీఏ ఎల్ఎల్‌బీ - రెండో సంవత్సరం), షేక్ అస్విల్ అహ్మద్ (బీసీఏ - మూడో సంవత్సరం)లు ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎన్‌సీసీ విభాగంలో ఎంపికయ్యారని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కార్యాలయం మంగళవారం తెలియజేసింది. వీరిద్దరు 26న జరిగే రిపబ్లిక్ డే కవాతులో ప్రధానమంత్రి ర్యాలీతో పాటు, ఫ్లాగ్ ఏరియా కాంపిటీషన్ అనే రెండు విభాగాలలో పాల్గొనడానికి ఎంపికయ్యారు. విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

కిట్స్‌లో ఫిజిక్స్ ఫర్ ఇంజినీర్స్-2 పుస్తకావిష్కరణ

గుంటూరు రూరల్: పుస్తక పఠనంతో మనిషి విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోగల కళాశాలలో కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ తోట కల్యాణి రచించిన ఫిజిక్స్ ఫర్ ఇంజినీర్స్ - 2 విత్ ఐఎస్‌బీఎన్ 978-93-95331-69-2 అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ డాక్టర్ కల్యాణి ఇప్పటివరకూ నాలుగు ఇంటర్నేషనల్ జర్నల్స్‌ను ప్రచురించారన్నారు. మూడు ఇండియన్ పేటెంట్ పబ్లికేషన్స్‌ను కలిగి ఉన్నారన్నారు. ం కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు తదితరులు డాక్టర్ కల్యాణిని అభినందించారు.

రాజా ది గ్రేట్

- కళ్లజోడుతో పనిలేదు
- గాంధీ ఆదర్శంగా ఖద్దరు
- ఒత్తిడి లేని జీవితం
- సైకిల్ ప్రయాణం
- దంపుడు బియ్యం ఆహారం
- ఇవే ఆరోగ్య రహస్యాలన్న 103 ఏళ్ల రాజారావు



తెనాలి: ఆయనకు 103 ఏళ్లు...గత నెలలో పుట్టినరోజు జరుపుకొన్నారు. ఇప్పటికీ కళ్లజోడుతో పనిలేదు. న్యూస్‌పేపరు చదువుతారు. టీవీలో న్యూస్ చూస్తుంటారు. దస్తావేజులు రాస్తుంటారు. స్వీట్లు ఇష్టంగా తింటారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 26న ఆయన్ను సత్కరించనున్నారని తెలిసి, మంగళవారం చెంచుపేట అమరావతి కాలనీలోని ఆయన ఇంటికి వెళితే వరండాలోనే అద్దె ఖరారునామా రాస్తూ కనిపించారు. కళ్లజోడు లేకుండానే..! పేపరువాళ్లు వచ్చారంటూ ఇంట్లోకెళ్లి కాఫీ పురమాయించి వచ్చారు. 'నా గొప్ప ఏముందండీ...నా కోసం కూడా మీరు రావాలా...' అంటూ చేతులు జోడించిన ఆ వయోవృద్ధుడి పేరు రావులపల్లి రాజా రావు. సొంతూరు యడ్లపల్లి. 1920లో జన్మించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఇంటర్ డిస్‌కంటిన్యూ చేయాల్సి వచ్చింది. ఇరవై ఏళ్లకే పెళ్లి. వరుసగా ముగ్గురు సంతానం. అప్పట్లో గ్రామంలో పార్ట్‌టైమ్ పోస్టుమాస్టరుగా చేశారు. కుటుంబ నియంత్రణ పాపం అనుకునే ఆ రోజుల్లో తనకు తానుగా వైద్యాధికారిని సంప్రదించి, వేసక్టమీ చేయించుకున్న ఆధునికుడు రాజారావు. స్వాతంత్ర్య పోరాటకాలంలో అన్ని ఉద్యమాల్లోనూ పాల్గొన్న రాజారావు జైలుకు వెళ్లలేదు. యడ్లపల్లి రైల్వేస్టేషను బయట గాంధీజీని చూశారు. అప్పట్నుంచి ఖద్దరు జీవితంలో భాగమైంది. పోస్టుమాస్టరు ఉద్యోగంలో 46 ఏళ్లు చేసిన రాజారావు, గత 75 ఏళ్లు గా డాక్యుమెంటు రైటర్‌గానూ చేస్తున్నారు. ఇప్పటికీ దస్తావేజులు రాస్తూనే ఉన్నారు. ముగ్గురు సంతానంలో ఒకరైన కృష్ణమోహన్‌రావు సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా రిటైరయ్యారు. ఇద్దరు కుమార్తెలు గృహిణులు. ఎనిమిదిమంది మనుమలు, 12 మంది మునిమనుమల సంతానం ఉన్నారు. గత డిసెంబరులో 103 పుట్టిన రోజు జరుపుకొన్న రాజారావు, ఇప్పటికీ తన పనులు తానే చేసుకోవడం విశేషం.

ముగిసిన రహదారి భద్రతా వారోత్సవాలు


ర్యాలీలో పాల్గొని, టూవీలర్ నడుపుతున్న జేసీ రాజకుమారి


గుంటూరు వెస్ట్: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించడంలాంటి చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే విలువైన ప్రాణాలు కాపాడుకోవచ్చని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. గతవారం రోజుల నుంచి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జరిగిన ముగింపు కార్యక్రమంలో జేసీతో సహా అధికారులు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడిపారు. జేసీ మాట్లాడుతూ ప్రజల అవగహన కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను అందరూ అర్థం చేసుకుని అవలంబించాలన్నారు. చాలా ప్రమాదాల్లో తలకు గాయాలు కావడంతోనే వాహనచోదకులు మరణిస్తున్నారని, అందుకు వాహనచోదకులు హెల్మెట్ ధరించడం బాధ్యతగా గుర్తించాలని కోరారు. అనంతరం రహదారి భద్రతపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు జేసీ, రవాణా శాఖ డీసీ కరీమ్, డీఆర్వో చంద్రశేఖరరావు, అధికారులు బహుమతులు అందజేశారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి

రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ

ఏఎన్‌యూ: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల పాత్ర కీలకమని రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ అన్నారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలో జరిగిన గుంటూరు, పల్నాడు జిల్లాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశంలో రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యతోపాటు సామాజిక సేవ, కళాశాలల అభివృద్ధికి ఎన్ఎస్ఎస్ ఉపయోగపడుతుందని తెలిపారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సామాజిక సైనికాధికారులుగా పనిచేసి, నవ సమాజ నిర్మాణానికి దోహదపడాలన్నారు. సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ విద్య, సామాజిక సేవ రెండింటినీ సమన్వయం చేస్తూ విద్యార్థులను ముందుకు నడిపించాల్సిన బాధ్యత ప్రోగ్రాం ఆఫీసర్లపై ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం.రవిశేఖర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నేషనల్ యూత్ పార్లమెంట్‌లో తమ పేర్లు నమోదు చేసుకునే విధంగా ప్రోగ్రాం ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఆచార్య ఎల్.ఉదయకుమార్, ఫిజికల ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, పలువురు ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

జిల్లా లెప్రసీ అధికారిగా డాక్టర్ లక్ష్మానాయక్



గుంటూరు మెడికల్: జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారిగా డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ వి.రామిరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ లక్ష్మానాయక్ ప్రస్తుతం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో రాష్ట్రీయబాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో-ఆర్డినేటర్‌గా, జిల్లా మలేరియా అధికారిగా, కోవిడ్ నోడల్ ఆఫీసర్‌గా ఆయన పనిచేశారు.

ఎయిమ్స్ ప్రజలకు వరం

మంగళగిరి: ఎయిమ్స్ వైద్యశాల ప్రజలకు వరం అని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ అన్నారు. నగర పరిధిలోని ఎయిమ్స్ వైద్యశాల ఐదవ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ ఎయిమ్స్ అభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందన్నారు. అతి తక్కువ ఖర్చులతో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఎయిమ్స్ వైద్యశాల తాగునీటి పైపులైను నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, త్వరలోనే పూర్తి అవుతాయని డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి వెల్లడించారు.

గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా సికింద్రాబాద్-తిరుపతి (07489) ప్రత్యేక రైలును ప్రయాణికుల సౌకర్యార్థం కేటాయించడం జరిగిందని డివిజన్ సీనియర్ డీసీఎం ఆంజనేయులు మంగళవారం వెల్లడించారు. ఈనెల 27వ తేదీ శుక్రవారం రాత్రి 7.05 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయలు దేరి మరుసటి రోజు ఉదయం 7.50 గంటలకు ఈరైలు తిరుపతి స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. అదేవిధంగా తిరుపతి-సికింద్రాబాద్ (07490) వయా గుంటూరు డివిజన్ రైలు ఈనెల 28 తేదీన శనివారం 8.25 గంటలకు తిరుపతి స్టేషన్ నుంచి బయలు దేరి మరుసటి రోజు 8.30 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

మంగళగిరి: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రైల్వే సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు... మంగళగిరి నగరంలోని రైల్వే బ్రిడ్జి కింద ట్రాక్ పక్కన గుర్తుతెలియని సుమారు 60 సంవత్సరాల వృద్ధురాలు రైలు ఢీకొని మృతి చెంది పడిఉంది. ఆమె ఎర్రరంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.